క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని మహబూబ్‌నగర్ శాసన మండలి సభ్యుడు నవీన్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తన నివాసంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువ కప్పి సత్కరించారు.

కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక



కడ్తాల్: నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్మికుల మండల కమిటీ

కడ్తాల్: మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో జరిగిన సమావేశంలో పంచాయతీ కార్మికుల నూతన కమిటీని బుధవారం పంచాయతీ కార్మికులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆశీర్వాదం, కోశాధికారిగా కృష్ణయ్యతో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటయ్య, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆశించిన స్థాయిలో హాజరు కాని విద్యార్థులు



కాగజ్‌ఘట్ పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థులు

మంచాల: గ్రామాల్లో పాఠశాలలు ప్రారంభం చేసినమొదటి రోజు ఆశించిన స్థాయిలో విద్యార్థులు హాజరు కాలేదు. ఉపాధ్యాయులందరూ విధులకు హాజరయ్యారు. విద్యార్థులు మాత్రం 20శాతం రాలేకపోయ్యారు. బుధవారం సాక్షి విజిట్‌లో భాగంగా సందర్శించగా ఆగాపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో 85 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, 5మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు వచ్చారు. మొదటి రోజు మాత్రం 15 మంది మాత్రమే విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. కాగజ్ ఘట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 28 మంది విద్యార్థులకు 8మంది మాత్రమే వచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు అండాలు, మరో ఉపాధ్యాయుడు వచ్చారు. మంచాల మండలంలోఅమ్మ ఆదర్శ పథకం కింద 13 పాఠశాలలను తీసుకోవడం జరిగింది. పాఠశాలలు ప్రారంభం చేసిన కూడా ఇంక పనులు కొనసాగుతున్నాయి.

భూదాన్ భూముల సమస్య పరిష్కరిస్తా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని సైదాబాద్ కంచెలో భూదాన్ బోర్డు భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. బాధిత భూదాన్ బోర్డు రైతులు ఎమ్మెల్యేని బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలను విన్నవించారు. అక్కడే ఉన్న ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సునీతలను ఎమ్మెల్యే వివరణ కోరారు. సుమారు 500 ఎకరాల భూమి సైదాబాద్ కంచెలో ఉన్నట్లు తెలిపారు. సర్వే నంబర్ లేకుండా, ప్లాట్ల నంబర్‌తో ఈ భూములున్నాయని, ధరణి రికార్డుల్లోకి ఎక్కలేదని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిలీలకు అవకాశం ఇవ్వకుండా సైదాబాద్ కంచెలో భూములున్న రైతుల వివరాలతో ఒక జాబితాను రూపొందించి తనకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఆగిన ‘మనబడి’ పనులు!

- అర్ధంతరంగా నిలిపేసిన కాంట్రాక్టర్లు
- నిధుల వినియోగంపై నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు



రాంపూర్ ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు (ఫైల్)

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ‘మన ఊరు–మన బడి’ పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. పాఠశాలల మరమ్మతులతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో నూతన భవనాలను నిర్మించడం కోసం ప్రభుత్వం విడుదల చేసింది. అందులో భాగంగా మండల పరిధిలోని 20 ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు కలిపి రూ. 3,71,93,576 నిధులు మంజూరయ్యాయి.

దీంతో ఆయా గ్రామాల పాఠశాలలు పూర్తి స్థాయిలో నిధులను ఉపయోగించుకోలేదు. కొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించలేదు. మరికొన్ని పాఠశాలలో 20 నుంచి 30 శాతం వరకు మాత్రమే పనులు చేశారు. పూర్తి కాని పనుల విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడానికి ముందుకు రాకపోవండతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. 20 పాఠశాలల్లో కేవలం రూ. 51,94,015 నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ముమ్మరంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు..

పాఠశాలలను అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పథకంలో భాగంగా మండలంలో 9 ఉన్నత ప్రాథమిక పాఠశాలలకు రూ. 8,91,000 నిధులను విడుదల చేసింది. చీపునుంతల, యడవల్లి, చెన్నారం, జూలపల్లి, మెదక్‌పల్లి, జంగారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలతో పాటు, రాంపూర్, ఖానాపూర్, గట్టు ఇప్పలపల్లి ఉన్నత పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలల్లో 80 నుంచి 100శాతం వరకు పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- గత ప్రభుత్వంలో విద్యారంగంపై నిర్లక్ష్యం
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లులో విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని ఆయన ఆరోపించారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో బడిబాటలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించడం జరిగిందని ఆయన చెప్పారు. విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేసిన ఘనత సీఎం రేవంత్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, ఎంపీటీసీలు నిట్టి నారాయణ, దోనాదుల కుమార్, ఎంఈఓ సర్దార్‌నాయక్, హెచ్‌ఎం పాండు, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ నాయకులు మండ్లి రాములు, వస్పుల మానయ్య, ఎగిరిశెట్టి సత్యం, జగన్, తదితరులు పాల్గొన్నారు.

వినతి:

మండల పరిధిలోని శెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

గృహజ్యోతి లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

కాంగ్రెస్ సీనియర్ నేత, బోల యాదగిరి



మాట్లాడుతున్నయాదగిరి

తలకొండపల్లి: గృహజ్యోతి లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని, అర్హులైన వారందరికీ 200యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తారని కాంగ్రెస్ సీనియర్ నేత బోల యాదగిరి పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున అర్హత కలిగిన వారందరికీ 0 బిల్లులు వస్తాయని పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు తప్పుడు సమాచారంతో ప్రజలను రెచ్చగొడుతున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్నవిధంగానే కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ప్రజారంజక పాలన కొనసాగుతుందని, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారందరికీ గృహజ్యోతి పథకం వర్తిస్తుందన్నారు. 0 బిల్లు రానివారందరికి 15 రోజుల్లో అందేవిధంగా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆగస్టులో రైతు రుణమాఫీ చేస్తారన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్తు

మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డ్రెస్సులు అందజేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బడిగంట మోగడంతో విద్యార్థులు పుస్తకాలు చేతపట్టి బడిబాట పట్టారు. పలు పాఠశాలలకు మామిడి తోరణాలు కట్టారు. పూలను అందిస్తూ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఇబ్రహీంపట్నం మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలల్లో 4,948 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొదటి రోజు మాత్రం విద్యార్థుల హాజరు పలుచగానే ఉంది. కేవలం 1385 మంది హాజరయ్యారు.

ఇబ్రహీంపట్నం రూరల్‌లో..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యపై మక్కువ పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లబోలు పాండురంగారెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు భారతి, ఉపాధ్యాయులు బుచ్చయ్య, రాంమోహన్, అశోక్, జంగయ్య, విజయలక్ష్మి, బబ్లీ, ఇందిర, మమత పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: విద్యార్థులు ప్రభుత్వం అందించే సహకారంతో కష్టపడి చదువుకోవాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యరెడ్డి పేర్కొన్నారు. మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బడిబాటలో భాగంగా స్కూల్ డ్రెస్సులు, పాఠ్య పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీ జైపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుగంధ, ఝాన్సీ, నారాయణరెడ్డి, మంచాల కో–ఆప్షన్ సభ్యుడు అశ్వల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, వారి భవితకు బంగారు బాటలు వేయాలని కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి కోరారు. అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు స్వప్నతో కలిసి ఆమె విద్యార్థులకు ఏకరూప దుస్తువులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దన్నె రాజు, జగన్, నరసింహ, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, రాధా, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: కర్కల్‌పహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులతో కలిసి పుస్తకాలు అందజేశారు. అదే విధంగా పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థులను పాఠశాలలో చేర్పించాల్సిందిగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈవో సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్యలు పలు పాఠశాలలను సందర్శించి పరిశీలించారు.

తలకొండపల్లి: మండలంలో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలన్నీ తెరుచుకున్నాయి. మందకొడిగా విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు హాజరైన విద్యార్థుల హాజరు శాతం తగ్గింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు.



మంచాల: డ్రెస్సులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యరెడ్డి



కడ్తాల్: కర్కల్‌పహాడ్ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేసిన హెచ్‌ఎం వెంకటేశ్వర్లు



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: దశల వారీగా ఇబ్రహీంపట్నం మండలాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ, పోచారం గ్రామాల్లో రూ.5.40 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పనులు వేగవంతం చేసి ప్రజలకు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా సీసీరోడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయలు కల్పించడానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజలందరూ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారని గుర్తు చేశారు. ప్రజాపాలన అందరికి చేరువయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, ఈసీ శేఖర్‌గౌడ్, రాచర్ల వెంకటేశ్వర్లు, బోసుపల్లి వీరేష్, ఎన్ను గోవర్ధన్‌రెడ్డి, తాళ్లపల్లి వెంకటేష్, చిన్నా, శ్రీశైలం, వెంకటేష్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి వినతి

మంచాల: మైనింగ్ నిలిపివేయాలని చిత్తాపూర్ గ్రామంలోని అఖిల పక్ష నాయకులు బుధవారం ప్రజా భవనంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ మైనింగ్ చేయకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిత్తాపూర్ గ్రామ అఖిల పక్ష నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు మాజీ వైస్ ఎంపీపీ దన్నె భాషయ్య, రావుల జంగయ్య, జిల్లామోని సత్తయ్య, వింజమూరి రాంరెడ్డి, బొడ్డు నాగరాజు గౌడ్, సత్యనారాయణ, రమేష్, కృష్ణ, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత



రికార్డులు పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత

కడ్తాల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు రావిచేడ్ గ్రామంలో ఎరువుల, విత్తనాల షాపులలో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఎరువుల షాపులలో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయా షాపులలో ఎరువులను, విత్తనాలను ఎంత ధరకు విక్రయిస్తున్నారు? అమ్మకం తదితర వివరాలను దుకాణాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వందన, డీలర్లు జైపాల్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించండి

సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

కడ్తాల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పది నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వాటిని వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ చాలీ చాలని వేతనాలతో పంచాయతీ కార్మికులు కాలం వెళ్ల దీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే జీతం కూడా సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. అదే విధంగా పంచాయతీ కార్మికులకు సబ్బులు, డ్రెస్సులు, ఇతరసామగ్రి వెంటనే పంపిణీ చేయాలని వినతిపత్రంలో కోరారు. లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థులకు ఘన స్వాగతం



మాడ్గుల: పాఠ్య పుస్తాకలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కావడంతో సందడి నెలకొంది. ఆదిబట్ల మున్సిపాలిటీలోని ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలకు మామిడి తోరణాలు కట్టి, బడికి వచ్చిన విద్యార్థులకు పూలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పరమేష్, ఉపాధ్యాయురాలు బబ్లీ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: మండల పరిధిలో 29 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అన్నిప్రభుత్వ పాఠశాలలు తెరచుకున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. కొన్ని పాఠశాలలకు విద్యార్థులు హాజరు కాలేదు. మండల పరిధిలోని పాఠశాలల్లో తొలిరోజు 15 శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. పలు పాఠశాలలను ఆమనగల్లు ఎంఈఓ సర్దార్ నాయక్ తనిఖీ చేశారు.

యాచారం: తొలి రోజు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పునఃప్రారంభం దృష్ట్యా గ్రామస్తులు పాఠశాలలకు మామిడి తోరణాలు కట్టి విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.



ఆమనగల్లు బాలికల ఉన్నత పాఠశాలలో తరగతిగదిలో కూర్చున్న విద్యార్థినులు



యాచారం: చింతపట్ల ఉన్నత పాఠశాలలో పంపిణీ చేస్తున్న ప్రత్యేకాధికారి సందీప్‌కుమార్



ఆమనగల్లు: బాలికల ఉన్నత పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థినులు